


# ప్రయాణం

"పట్టిసపు"

ఎమ్మెస్సీ ప్రీవియస్ ఎగ్జామినేషన్సు అవగానే శలవల్లో వుండడానికి మా స్వగ్రామమైన కాకినాడ వచ్చాను. వచ్చిన అలసట యింకా తీర్చుకోకముందే పెద్దన్నయ్య మద్రాసు వెళ్ళడానికి ముందుగా పోర్టు స్టేషన్‌కి వెళ్ళి టిక్కెట్టు తీసుకొని, సీటు రిజర్వు చేయడానికి నన్ను పంపేరు. పోర్టు కెళ్ళి టిక్కెట్టు తీసుకొని, 'సర్కార్' లోకోషెడ్డు నుండి ప్లాట్‌ఫారం మీదకు రాగానే ఓ కంపార్టుమెంటులోకి ఎక్కి బెర్తుపైన దుప్పటి పరచి, క్రింద సీటులో కూర్చున్నాను. సిగరెట్ తీసి, వెలిగించి ప్లాట్‌ఫారం వైపు వస్తూన్న జనాన్ని చూడసాగాను. ఫామిలీ ప్లానింగ్" అమలు జరపలేదా అన్నట్లున్న ఓ పెద్ద కుటుంబం తరలి వస్తోంది...మా కంపార్టుమెంట్ వైపు.

ఓ లావుపాటి ఆయన, ఆయనకు తగ్గట్టే వాళ్ళావిడ, ఓ పదారేళ్ళ అమ్మాయి, మరి నలుగురు పిల్లలు (ఇద్దరు ఆడ, ఇద్దరు మగా లెండి). ఓ బొచ్చుకుక్క, బోలెడు సామాన్లు, బోల్టు లూడ దీసిన మంచాలు. కంపార్టుమెంటు చేరాయా అని ఆయన బాల్డ్ హెడ్ సవరించుకుంటూ చూస్తున్నాడు. ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నారు గాబోలు, అయినా నా కెందుకులే అని ఊరుకున్నాను.

ఎదురుగుండా సీటులో కూర్చున్నావిడ పిల్లాడు 'కేర్' మని గట్టిగా ఏడవడం మొదలు పెట్టాడు. ఆవిడ శతవిధాల ప్రయత్నించి ఊరుకో పెట్టలేక పోయింది. ఒకసారి సిగ్గుగా అటు, ఇటు చూసి పాలివ్వడం మొదలు పెట్టింది.

ఎటు చూడ్డానికి లేక, కిటికీలోంచి ప్లాట్ ఫారం వైపు గాక ఇవతలి వైపు చూస్తూ కూర్చున్నాను. పట్టాలకి, పట్టాలకి మధ్య ఓ మేక వీపు మీద కురుపుని ముక్కుతో పొడుస్తోంది కాకి. ఆ బాధ భరించలేక రైలు క్రిందకి దూకిందా మేక.

"పైన పరచిన దుప్పటి ఎవరిది మాష్టారూ?" అన్న మాటలు విని ఒక్కసారి లోపలకు చూశాను. సన్నగా, పొడుగ్గా వున్న సదరు వ్యక్తిని చూసి "అవునండి, నాదే" అన్నాను

"ఎందాకా వెడతారూ?" అన్నాడు తల మీదున్న రెండో, పదో వెంట్రుకల్ని సవరించుకుంటూ.

"ఈ రైలు కదలనని మొరాయించే వాకాను. అవునూ . .మీ కెందుకు?" అన్నాను.

ఎదురుగుండా ఆవిడ పిల్లాడ్ని మరో పక్కకు మారుస్తూ కిసుక్కున నవ్వింది.

"అయితే, ఇక్కడ సీటు లాభం లేదన్న మాట" అని గొణుక్కుంటూ దారిచ్చుకున్నాడు.

నవ్వుకుంటూ కిటికీ లోంచి చూడడం మొదలు పెట్టాను.

ఎంత సేపటినుంచి అలా చూస్తోందో కాని, ఆ లావుపాటి ఆయన పదహారేళ్ళ మ్మాయి, ఐదు కిటికీల అవతలనుండి నన్నే చూస్తోంది. నాకు కూడా ఆమెనలాగే చూడాలనిపించింది.

అదే ప్రకారంగా ఆమె కళ్ళల్లోకి చూడసాగాను. అలా ఎంతసేపు చూసినా ఆమె కళ్ళు మాత్రం దించ లేదు. ఇందాకా వాళ్ళ ట్రైన్ ఎక్కేటప్పుడు మామూలుగా అందర్నీ చూసినట్లే ఆమెనీ చూశాను. కాని ఇప్పుడలా ఆమెని చూడలేకపోతున్నాను. ఆమె కళ్ళల్లో ఏవో భావాలు నా మదిలో బాధలు రేపుతున్నాయి. ఆ కళ్ళల్లో వెలుగు, జిలుగు, ఆ చూపులోని చురుకు-కరుకులు, ఆ ముక్కు తీరూ-తెన్నూ, పలువరసల అందం-చందం చూస్తూంటే, దేవలోకం నుండి దిగివచ్చిన మేనకా, లేక రెబెకాయా (ఇదేం కాయ కాదు) అనిపించింది. నాకు తెలియకుండానే నా మనస్సు ఆమెను ఆరాధించడం మొదలు పెట్టింది. మధ్యలో పానకంలో పుడకలా, చేప కూరలో ముల్లులా, నాల్గవ కిటికీలోంచి ఓ పల్లెటూరి రైతులాంటివాడు బయట పెట్టాడు ట్రాన్సిస్టర్ ఏరియల్ని. ముందు గరగర సౌండ్, తరువాత సిలోన్ కాబోలు 'మెరె సామునె వాలే కిడికీ మే' అన్న పాట వస్తోంది. 'ఇవాళ ఆదివారం కదా! అంచేతే ఇంకా వస్తున్నాయి పాటలు.' అనుకున్నాను నవ్వుకుంటూను, సందర్భం సరిపోయినందుకు.

ఇంతలోకే ట్రైన్ కూతేసి, నడవడం మొదలుపెట్టింది. నా మనస్సులో భావాలు కూడా నడవడం మొదలుపెట్టాయి.అప్పుడే "బూట్ పాలిష్ సార్" అంటూ కాలు పట్టుకున్నా డో కుర్రాడు.

"బ్రూట్ పాలిష్ ట ... పాలిష్... అక్కరలేదు" అని విదిలించుకున్నాను.

కాకినాడ టౌన్ స్టేషన్ వచ్చేసింది. ఒక్క నిట్టూర్పు నిట్టూర్చి 'మా అన్నయ్య ట్రైన్ ఎక్కడానికి సాయబడి సామర్ల కోట దాకా వెడితే బాగుండును. ఎడ్రస్ ఎలాగో తెలుసుకోవచ్చు' అనుకున్నాను.

కాని యిప్పుడా రష్‌లో టికెట్ తీసు కునేసరికి రైలు వెళ్ళిపోతుందని అక్కడే ప్లాట్‌ఫారం మీద నించుని చూస్తున్నాను. ఆమె వాళ్ళ తమ్ముడు కూర్చున్న సీటులో సర్దుకుంటూ నాకు కనిపించేటట్లుగా కూర్చుంది. ఇంతలో గార్డు విజిల్‌తో రైలు కూత కూసి బయలుదేరింది. అన్న య్యతో వుంటానని చెప్పి, కాసేపు సంశ యించి, జేబురుమాలు తీసి గాలిలో వూపాను. ఆశ్చర్యం ఏమిటంటే, ఆమె కూడా చెయ్యి గాలిలో వూపడం మొదలు పెట్టింది. ఆమె ధైర్యాన్ని మెచ్చుకో కుండా ఉండలేక పోయాను. కనుచూపు మేర అలా చేయి వూపి, రైలు బొమ్మ రైలంత కనబడే దాకా చూసి, నిట్టూర్చి, యింటి ముఖం పట్టాను. ఏ పని చేసినా, చెయ్యకపోయినా ఆమె ముఖమే కనబడు తోంది, కళ్ళకు కట్టినట్లు.

ఈ సంఘటనలన్నిటినీ పూర్తిగా రాసి, చివరలో వాళ్ళిద్దరూ కలుసుకున్నట్లుగా సుఖాంతం చేసి, ఓ కథ రాసి, దాన్ని ఓ పత్రిక్కి పంపిస్తూ....ఎడిటర్‌గారికి. . . దీనిపై ఏమైనా ఉత్తరాలుగాని, విమర్శలు గాని, మరే యితరమైన లేఖలుగాని వచ్చినా నాకు పంపమని రాసి పంపాను. రెండు నెలల తర్వాత కాబోలు నాకో చిన్న పేకెట్ వచ్చింది. అందులో ఎడిటర్‌గారు వ్రాసిన ఉత్తరంతోబాటు ఆరు ఉత్తరాలు వున్నాయి.


మొదటి ఉత్తరం. ."మీ కథ చాలా బాగుంది. కథ సుఖాంతం చేసినందుకు చాలా సంతోషిస్తున్నాను"

రెండవ ఉత్తరం ."కథ థీమ్ బాగానే వుంది గానీ, హీరో చవటలా వున్నాడు. మీ రింతకు పూర్వం వ్రాసిన కథలకు, ఈ కథకు చాలా వ్యత్యాసం వున్నదని పించింది."

మూడవ ఉత్తరం .."మీ కథ బాగానే వుంది . గాని సుఖాంతం కాకుండా, దుఃఖాంతం చేస్తే యింకా బాగా రాణిం చేదేమో! కథ అనిపించింది."

నాల్గవ ఉత్తరం . "కథలో హీరో యిన్ హిందూదేశపు మరియూ . ఆంధ్ర దేశపు కన్నెపిల్లలా లేదు, మలుపు బాగానే వుంది."

ఐదవ ఉత్తరం ."మీ కథలో రాసి నట్లు రైళ్ళలో యిటువంటి సంఘటనలు జరగడం నేనూ చూశాను. కథ చాలా సమంజసంగా ఉంది. నాకు చాలా నచ్చింది.



కాని నా మిత్రుడొకడు ఇటువంటి ఆంగ్ల కథ చదివినట్లు అనుమానం వెలిబుచ్చాడు. నే నతన్ని గట్టిగా ఖండించాను. మీ మీద నమ్మకంకొద్దీ!"

ఆరవ ఉత్తరం .విసుగ్గా తీశాను. అందులో యిలా వుంది. "శ్రీనివాస్‌గారికి, మీరు వ్రాసిన కథ చదివాను కథలో మీరు వ్రాసిన స్త్రీ పాత్ర నేనే నంటే మీరు ఆశ్చర్యపోతారనుకుంటాను. కథ రాయడానికి మీ ఉద్దేశ్యం ఏమైనా మనిద్దరినీ మళ్ళీ కలపడానికే యీ కథ చాలా ఉపకరించిందనుకుంటాను. మీ గురించి కూడా నేను ప్రయత్నం చేయకపోలేదు. కాని మీ కొచ్చినంత అయిడియా నాకు రాలేదు. ఈ ప్రోబ్లం యింత యీజీగా సాల్వ్ చేయగల బుద్ధిశాలురని నా కిప్పుడే తెలిసింది. మన మొకసారి ఈ క్రింది ఎడ్రస్ దగ్గర కలుసుకొని మన అభిప్రాయాలు ఏకమైన వెంటనే మన పెద్దల అనుమతిని తీసుకొని, వివాహం చేసుకొందాం. తప్పక వస్తారు కదూ!

మీ

'గీత.'

ఉత్తరం చూసిన వెంటనే నాలోని ఉత్సాహం పెల్లుబికి పోయింది. ఎగిరి

గంతేసినంత పని చేశాను. ఇందాకటి విసు గంతా పోయింది.

గబగబా బ్రీఫ్ కేస్‌లో రెండు జతల బట్టలు, కుక్కుకొని బయలుదేరాను భీమవరానికి. రైలు దిగి తిన్నగా ఆమె చెప్పిన అడ్రస్సుప్రకారంచేరి,రెండంతస్థుల భవనం ముందు ఇటూ, అటూ తచ్చాడుతున్నాను. ఇంతలో ఏడేళ్ళ కుర్రవాడు, "మీరేనా!.... శ్రీనివాస్‌గారు?" అని అడిగి నన్ను తనతో ఆ మేడ పై అంతస్థుకి తీసుకెళ్ళి కూర్చోబెట్టి, ఆ రోజు దినపత్రిక చేతిలో పెట్టి ప్రక్క గదిలోకి వెళ్ళాడు. నా తల్లో ఆలోచన్లు కార్టూన్‌లలో వేసే స్ప్రింగ్‌లలాగ తిరగసాగాయి. యింతకుమునుపు కొన్ని నిముషాలు మాత్రమే ఆమెను చూసిన నేను మొదటిసారిగా ఆమెతో పరిచయమున్న వాడిలా . ఎలా మాట్లాడ్డం? అని ఆలోచించసాగాను. అయినా వాళ్ళ వాళ్ళు చూస్తే ఏమనుకుంటారో! ఒకవేళ ఆమె పెళ్ళికి ఒప్పుకుంటే మా వాళ్ళను ఒప్పించటం పెద్ద కష్టమేమీ కాదు ఈ ఆలోచనలతో తలకు రాసిన కోకోనట్ ఆయిల్ ఇవాపరేట్ కాసాగింది. తలుపు తీసుకుని,ఒక అమ్మాయి కాఫీట్రే పట్టుకొని, తలవంచుకొని వచ్చింది. ఈమె గీతకి ఏమౌతుందా అని ఆలోచించసాగాను. కాస్త భయం, అనుమానంతో వున్నట్లు వణుకుతున్న గొంతుకతో . "మీ....మీరేనా....శ్రీనివాస్‌గారు?" అంది.

"అవునండి. నేనే ...శ్రీనివాస్‌ని...."

"మీ కథ చాలా బాగా వ్రాశారు. ఇటువంటి కథలు చాలా అరుదుగా వస్తూ వుంటాయి. ఇంత మంచి కథ రాసినందుకు నా హృదయపూర్వక అభినందనలు."

"మీరు. . మరీ అంత పొగడకండి. నేనంత అర్హుణ్ణి కాను. ఇంతకీ...గీతగారు బైటికెక్కడికైనా వెళ్ళారా?...."

"అబ్బే లేదండి. ఎక్కడికీ వెళ్ళలేదు."

"మరి...."

"సారీ....నా పేరే గీత. కాని మిమ్మల్ని నే నెప్పుడూ చూసినట్లు లేదే. ఒక వేళ మీరు రాసిన కథ ఊహ మాత్రమేనా?. ."

"సారీ . టు టెల్ యూ. .చాలా కథలు ఊహించి రాసినా ఇది మాత్రం కాదు "

"అయితే.. మీరు నన్ను క్షమించాలి. నాకు కూడా యిలాంటి ఇన్సిడెంటే...జరగబట్టి మిమ్మల్ని పిలవాలని వచ్చింది. ఐ యామ్ సో సారీ...."

"నెవర్ మైండ్ టేక్ యిట్ యీజీ. ఇటువంటి సంఘటనలు మన జీవితంలో చాలా జరగచ్చు. ఒక గమ్యానికి చేరడానికి ప్రయాణించే ప్రయాణికులు గమ్యాన్ని చేరుతారా! లేదా! అన్నది చెప్పలేం. ఇటువంటివి మనస్సులో పెట్టుకొని, బాధపడ్డం అవివేకం. లెటజ్ ఫర్గెట్ ఎవ్విరిథింగ్..." అంటూ కుర్చీలోంచి లేచి, నిలబడి స్టేషన్ వైపు దారితీశాను.